REGD: NO. H. 18 విడిప్రతి 0–20 పై. 4–12–64 శుక్రవారం

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 36 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 49

జపాన్‌లో మంత్రి శ్రీ ఏ. సి.



రాష్ట్ర రాజధాని

# వదంతులు

## ఇవి బాధ్యతగల కాంగ్రెస్ వాదులు వ్యాపింపజేసేవేనా?

( మా హైదరాబాదు విలేఖరి )

వదంతులు ప్రజాస్వామికమైన వ్యవస్థలో సహజం. స్వతంత్రభారత రాజధానిలో ఇటీవల వదంతులు లేవదీయడం, వాటిని 'వార్తలు'గా నమ్మకమైన సమాచారంగా ప్రచారంచేయడం పరిపాటని పీకొద్దికాలమైనా ఢిల్లీలో వున్నవారికి అనుభవైకవేద్యమే. ప్రతి రాష్ట్రరాజధానిలోను యిలాంటి పుకార్లు చెలరేగడంకూడా అందరికీ తెలిసిందే.

కాని గత వారంరోజులనుంచి హైదరాబాదులో కొందరు అధికార్లగురించి, ఒకానొకమంత్రినిగురించి చెలరేగిన, చెలరేగింపజేసిన వదంతులు – ఈమధ్య యెన్నడూ కనీవిని యెరగనివనిచెబితే అతిశయోక్తి కాదు. అవి నిజం కాకపోవచ్చునేమో వాటి బలంగా కనపడుతున్నది. ఈ విషయం స్థానికమైన ఒక వారపత్రిక ఈ వదంతుల గురించి ప్రస్తావించి, విచారణ జరిపించి, వాటిని ఖండించవలసిన అవసరం ఉందని వ్రాసింది. దీనినిగురించి ఒక స్వతంత్రపార్టీ సభ్యుడు ప్రశ్నించినప్పుడు "ఇలాంటివెత్త" చదవవద్దని ముఖ్యమంత్రి ఆ సభ్యునికి సలహాయిచ్చారు. కాని అందువల్ల వదంతుల్లో నిజముంటే వుంటుందని ప్రజల్లో వెంటనే కలిగిన అభిప్రాయం.

శోచనీయమైన ఈ స్థితికికారణం, ఈ వదంతులవెనుక నిజముండి వుంటుందని కాదు, అధికారంలో బాధ్యతగల స్థానంలో వున్నవారు ఈ వదంతులను ప్రచారం చేస్తూ వుండడమే. ఈ సంగతి, ఈ వదంతులకు ప్రధానంగా గురియైన బలరామరెడ్డిగారు ముఖ్యమంత్రిగారి దగ్గరకు వెళ్ళి తీవ్రమైన అసమ్మతిని తెలియజేయడం, విచారణ జరిపించి, అందుకు బాధ్యులైన వారిపైన తగినచర్య తీసుకోవాలని కోరడం కూడా జరిగిందట.

ఈ పుకార్లు ఇంకా ఎంతకాలం వ్యాపకంలో వుంటాయో తెలియదు. వాటి గతి ఏమైనప్పటికీ, గమనించవలసిన విషయం ఏమిటంటే, ఒక మంత్రి లంచం తీసుకున్నాడనో లేక మరేదైనా దురాచారానికి దిగజారాడనో ఎవరైనా చెబితే ప్రజలు, బాధ్యతకల స్థానంలో ఉన్నవారుకూడా, వెంటనే నమ్మేస్తున్నారు. మన నాయకులకు పరిపాలకులకు సమాజంలో వున్న పలుకుబడి, ఖ్యాతి ఇలాంటిదన్నమాట.

పుకార్లన్నీ "చెత్త"అని చెప్పిన ముఖ్యమంత్రి ఈ విషయాన్ని గమనించడం ముఖ్యమని వేరే చెప్పనక్కరలేదు. యివి "చెత్త" కావడమే ఎక్కువప్రమాదకరమైనది. అధికారంలో ఉన్నవారినంతా ఏదో స్వార్థాశయం కోసమని చాటుతూ, వాస్తవాలు తెలుసుకొనకుండా నిందించడమారంభిస్తే, ఇక పదవులను ఆక్రమించడానికి ప్రజానిందలను లక్ష్యంచేయని శీలంలేని వ్యక్తులు మాత్రమే ముందుకువస్తారు. ఇది ప్రజాస్వామ్యానికి దేశానికి తీరని హానిచేస్తుందని వేరే చెప్పనక్కరలేదు.

—తరువాయి 7-వ పేజీలో



పి. డబ్ల్యు. డి. శాఖామాత్యులు శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు ఇటీవల జపాన్‌లో పర్యటించారు. పైచిత్రం: క్యోటోకి సమీపంలోని బౌద్ధ ఆలయాన్ని దర్శించి, పిల్లలతోవున్న ఏ. సి. బృందం. దిగువ చిత్రం: జపాన్ ఇంజనీరింగు కంపెనీకి చెందిన అధికార్లు, ఇంజనీర్లతో–కూర్చున్నవారు ఎడమనుండి కుడికి వరుసగా–అనం వెంకటరెడ్డి (కడియం), ఏ. సి., నారాయణన్ (ధర్మ తేజ కంపెనీ), బొప్పన హనుమంతరావు.

## ప్రజల, ప్రతిపక్షాల అసంతృప్తి వాతావరణంలో ప్రారంభమైన

# శాసనసభ సమావేశం

మా హైదరాబాదు విలేఖరి

ప్రతిపక్షాలు విమర్శించినప్పుడు, విమర్శలు సహేతుకమైనవనుకున్నప్పుడు, వాటినుంచి గుణపాఠంనేర్చుకొని ఇలాంటి విమర్శ మళ్ళీ రాకుండాచూసుకోవడం సామాన్యవిజ్ఞత. కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ అలవాటులేదని చెప్పవచ్చును. ఈవిషయం గత బుధవారంనుంచి ప్రారంభమైన రాష్ట్రశాసనసభ శీతాకాల సమావేశంలో మళ్ళీవొకసారి రుజువైంది.

అసెంబ్లీ నిబంధనలప్రకారం, బిల్లులను సభలో ప్రవేశపెట్టినతర్వాత దాన్ని గజెటులో ప్రకటించాలి. ఆ తరువాత దానిపైన చర్చ ప్రారంభమవుతుంది. ఈ కార్యవిధానం స్వర్గీయ కాశీశ్వరరావుగారు సభాపతిగావున్నరోజుల్లోనే అమలుచేశారు. కాని యెంతోముఖ్యమైన, ఎన్నిరోజులనుంచో నిరీక్షింపబడిన సమగ్రమైన వర్తకగుమాస్తాలకు సంబంధించిన బిల్లుశాసనంవిషయంలో మంత్రిగారు, వేలరూపాయలవేతనాలతో ఆయనకు సక్రమమైన సలహానివ్వవలసిన బాధ్యతకల వుద్యోగులు పూర్తిగా విస్మరించి, తమని, ప్రభుత్వాన్ని నగుపాలుచేసుకున్నారు. కార్యవిధానంలో కొద్దిపొరపాట్లు వుంటే, చూసీచూడకుండా ప్రతిపక్షాలు వుండవచ్చును. ఎన్నోసందర్భాలలో యిలాంటి కేవలం నిబంధనలకు సంబంధించిన అభ్యంతరాలను గమనించకుండా యిరుపక్షాలు వుంటాయి. లేకపోతే కార్యక్రమం అనుకున్నట్టుగా జరగడం దుస్తరమవుతుంది. కాని చట్టంప్రకారం మంత్రిగారి సంతకంతో అచ్చుదికాకపోతే, సైక్లోస్టైల్ చేసిన బిల్లయినా సమర్పించనప్పుడు, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కనికరించాలని ఆశించడం దురాశకాకమానదు. సభాపతికూడా ఈ అభ్యంతరాన్ని లేవనెత్తిన వావిలాల గోపాలకృష్ణయ్యగారిని సమర్థించక తప్పలేదు. ఫలితమేమిటంటే, బిల్లుపైన చర్చ మరినాలుగైదురోజులు వాయిదాపడింది.

ఉన్నచట్టాన్ని రద్దుచేసేయినా సమర్పించే టందుకు బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, సవరింపబడనున్న చట్టంతోబాటు వివరాలను సభ్యులకు తెలియజేయాలని సభాపతి తీర్పులు అదివరకెన్నోసార్లిచ్చారు. కాని యెందుచేతనో ప్రభుత్వం యీ విషయాన్ని విస్మరిస్తూవుంటుంది. ఇలాంటి బిల్లులు వచ్చినప్పుడల్లా సభలో రభస తప్పదు. ఈసారికూడా గనులకోసం భూసేకరణకు సంబంధించిన బిల్లుశాసనం విషయంలో ఇలాంటి పొరపాటుజరగడం, దానిపైన చర్చ మరునాటికి వాయిదాపడ

—తరువాయి 7 వ పేజీలో

# రామాలయ రగడ!

భద్రాద్రి రామాలయ పునర్నిర్మాణం పెద్ద రగడగా తయారయింది. శ్రీ కల్లూరి చంద్రమౌళిగారి అధ్యక్షతనవున్న పునర్నిర్మాణ సంఘాన్ని రద్దుచేసి, నిర్మాణ కార్యక్రమం కొనసాగించుటకు ప్రభుత్వం చట్టసవరణ చేసింది; సభ్యులకు నోటీసులు జారీచేసింది; నేడే రేపో తొలగింపు!

ప్రభుత్వ ఈ చర్య చట్ట విరుద్ధమని శ్రీ చంద్రమౌళి హైకోర్టులో ఒకదావావేసి ఎందువల్లనో వుపసంహరించుకున్నారు.

రామాలయ పునర్నిర్మాణం వెంటనే కొనసాగాలని భద్రాచలంలో సత్యాగ్రహాలు, నిరాహారదీక్షలు ప్రారంభమైనాయి.

గర్భగుడి బయటగోడ 11 అడుగులు. దీనివిషయంలో వివాదాలులేవు. తగాదా అంతా లోగోడల విషయంలోనే. ప్రస్తుతం లోగోడ 7 అడుగుల 7 అంగుళాలున్నది; దీన్ని చంద్రమౌళి సంఘం 8 అడుగుల 4½ అంగుళాలకు పెంచాలంటున్నది. ప్రభుత్వం వీలుకాదంటుంది. పడగొట్టబడిన గర్భగుడిపని ఈవిధంగా ప్రతిష్టంభనలో పడిపోయింది. మానవమాత్రుల సంకుచిత వివాదాలవల్ల భద్రాద్రివేల్పు ఆకాశం క్రింద కాపురం చేయవలసి వస్తున్నది.

పవిత్రమైన ఈ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం రాజకీయమైనరూపం ధరించడం శోచనీయం!

—

చలికాలానికి

ఉలన్

స్వెట్టర్లు మఫ్లర్లు బేబీసూట్లు టోపీలు

సిటీ డ్రెస్ హోమ్

ట్రంకురోడ్డు ఫోన్ : 444 నెల్లూరు

# కాసులనిచ్చే కాలక్షేపం

## పనితోచని ఇల్లాలి కోళ్ళపెంపక గాథ

ఉత్తరప్రదేశ్‌లోని ఒకవూరి బడిలో శ్రీమతి గుప్త టీచర్‌గా పనిచేస్తుండేది. కాని పెళ్ళయిన కొంతకాలానికి ఆమెభర్తకు 'నిలోఖేరి' అన్న వూరి (పంజాబురాష్ట్రాని)కి బదలీ అయింది. అపుడు శ్రీమతి గుప్త తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, భర్తతో బాటు నిలోఖేరి వెళ్ళవలసివచ్చింది.

క్రొత్తవూరు, అందులోనూ శ్రీమతి గుప్త ఒకప్పుడు ఉద్యోగం చేసిన మనిషి— అట్లాంటి ఆమెకు వూరికే కూర్చోవడం అంటే ఎంతో చికాకుగా వుండేది. చేతినిండా పనివుంటే సంతోషించే మనిషికి ఏమీ పనిలేకపోతే ఎంతకష్టం! శ్రీమతి గుప్త పరిస్థితి ఇట్లాగే తయారయింది. తన భార్య మనసులోని అశాంతిని గుప్త గుర్తించాడు. ఆమెకు ఏదయినా కాలక్షేపం వుండాలి అని అనుకున్నాడు.



ఇంటికి కూరగాయలు, కోళ్లకు ఆకుకూరలు: శ్రీమతి గుప్త ఇంటి ఆవరణంలోని తోట

అది 1962 సంవత్సరం డిసెంబరునెల. నమ్మకద్రోహంచేసి చైనా మనదేశంపై దాడిచేసిన దినాలు. అపుడు మన సైనిక దళాలు, వారి ఆహారనిమిత్తం కోడిగ్రుడ్లను సరఫరా చేయడం—గురించి ఎక్కువ చర్చలు వినవడుతుండేవి. శ్రీ గుప్తా ఇది విని—తన భార్యకూడా కాలక్షేపం నిమిత్తం నాలుగు కోళ్ళను పెంచితే బాగుండునేమో అనుకున్నాడు. ఆమాట విని వినగానే శ్రీమతి గుప్త త్రుళ్ళిపడింది. "ఛీఛీ-కోళ్ళను ముట్టుకోవడమా-అబ్బే-" అని అసహ్యించుకున్నది-శాకాహారియైన శ్రీమతి గుప్త.

అయినప్పటికి ఒకరోజు గుప్తా నిలోఖేరి 'ఫార్మ్' నుండి నాలుగుకోళ్ళను తెచ్చి ఇంటి ఆవరణలో విడిచిపెట్టాడు. మొదట ఆమె అటువైపు చూడ్డానికికూడా ఇష్టపడలేదు. కోళ్ళ విషయమంతా గుప్తాయే చూచుకునేవాడు.



శ్రీమతి గుప్త ఇంటిఆవరణంలో పెరుగుతున్న కోళ్ళు

ఒకరోజు గుప్త ఆఫీసుకు వెళ్ళివుండగా— ఒకకోడి దాహంతో నీరుదొరకక అవస్థ పడుతుండగా శ్రీమతి గుప్త చూచింది. అంతే! స్త్రీలోని మాతృసహజమైన ప్రేమ పెల్లుబికింది. ఆమెకు ఆ కోళ్ళపట్ల వాత్సల్యం ఏర్పడింది, వాటి లాలనపాలన తనే చూడ సాగింది. కాని మొదట మొదట ఆ కోళ్ళ గ్రుడ్లని ఏమిచెయ్యాలో తెలిసేదికాదు. కాని చాలమంది కోడిగ్రుడ్లను డబ్బిచ్చి కొనుక్కుంటారని తెలియడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. ఒక్కసారిగా ఆమె మనసు సంతోషంతో నిండింది. ఈకోళ్ళ పెంపకంవలన-తన విరామకాలం గడపడానికి కాలక్షేపం దొరికింది. అంతేకాక దీనిద్వారా తన అవసరాలకు కావలసిన డబ్బులూ సంపాదించవచ్చును-అని తెలిసింది ఆమెకు.

అంతే! అప్పటినుండి కోళ్ళపెంపకం పట్ల శ్రద్ధ వహించసాగింది శ్రీమతి గుప్త. నిలోఖేరి ఫార్మ్‌నుండి గ్రుడ్డు ఒకటికి 31 పైసల చొప్పున 200 గ్రుడ్లను పొదిగించడానికని తెప్పించింది. షాహాబాద్‌లోని ఒక కోళ్ళఫార్మ్‌లో రూ 20 ఇచ్చి 200 గ్రుడ్లను పొదిగించింది. మొత్తంమీద 85 పెట్టకోళ్ళూ, 76 పుంజుకోళ్ళూ వచ్చాయి. ఆ కోడిపిల్లల్ని మూడు నెలలపాటు పోషించి—వాటిని ఢిల్లీకి తెచ్చి ఒక్కొక్కకోడిని 2-25 రూపాయల చొప్పున అమ్మింది శ్రీమతి గుప్త.

దీని తర్వాత-ఆమె తన ఇంటి ఆవరణలో 15అ. × 20అ. వైశాల్యంగల కోళ్ళకుటీరాన్ని ఇటుకమట్టితో నిర్మించింది. కోళ్ళకుతిండి పెట్టడానికి తట్టలూ-త్రాగేనీటి ఏర్పాటులూ, – గ్రుడ్లుపెట్టడానికి పెట్టెలూ అన్నీ అమర్చింది.

రచయిత్రి:
**ముక్త ముందుర్కార్**

మళ్ళీ గ్రుడ్లను తెప్పించి పొదిగించింది. ఆమె తన కోళ్ళను పెంచడానికి "డీప్ లిట్టర్" (Deep litter) విధానాన్ని అనుసరిస్తుంది. అంటే కోడిపిల్లలు తిరిగే నేలమీద మందంగా ధాన్యపుపొట్టు, ఎండుగడ్డి ముక్కలు—వేసివుండడం అన్నమాట. శ్రీమతి గుప్త కోళ్ళకుటీరంలోపల, కోడి పిల్లలుతిరిగే నేలను కప్పివుంచడానికి వరి ధాన్యపు పొట్టునూ, కోళ్ళుతిరిగే చోటును బియ్యపుతవుడునూ వాడుతుంది. ప్రతి ఆరు

—తరువాత 11 వ పేజీలో

## తండ్రిని మించిన కొడుకు?




జీవిత భీమాకు
ప్రతిగా మరొకటి లేదు.

## జనవాణి

## జిల్లాపరిషత్తురోడ్లా? జంగిలిగొడ్లడొంకలా?

### ముత్తుకూరు— వెంకటాచలంరోడ్డు

ముత్తుకూరు – వెంకటాచలం రోడ్డు ఘోరమైన, అధ్వాన్నమైన స్థితిలో వుంది. దున్నపోతుల బండికూడాపోవడానికి వీలులేని హీనస్థితిలోవుంది. గర్భిణీ స్త్రీలను బస్సుల్లో యెక్కించి ఈరోడ్డుమీద పంపిస్తే మలక ప్రసవం కలుగుతుందని ఈప్రాంత ప్రజానీకం స్వానుభవంవల్ల చెప్పుకొన్న సత్యం.

14 మైళ్ళ నిడివిగలిగిన యీ రోడ్డు జిల్లాలో అతిముఖ్యమైనది. 8 కేల్యాంక్ బస్సులు రోజుకు 38 సార్లు తిరుగుతుంటాయి. 30 ట్రాక్టర్లు నిరంతరం పాటిమట్టి తోలుతుంటాయి. కృష్ణాపట్నంలో తయారయ్యే వుప్పు, సర్వేపల్లి రిజర్వాయరు క్రిందపండే ధాన్యం యీరోడ్డుమీద రవాణా కావాలి.

రాపూరు నియోజకవర్గంలో గ్రామ ప్యాంచేని, ఒక్కబస్సు తిరిగేరోడ్డునుసయితం హైవేస్‌లో కల్పుకొన్న ప్రభుత్వం, ఈ ముఖ్యమైన రోడ్డును యెందుకు కలపలేదో మరూహ్యం. కోటసమితికి చెందిన కాలిబాటల్నికూడా పరిషత్‌లో కలుపుకొని కారురోడ్లువేసే మన జి. ప. వారైనా యీ రోడ్డును యెందువల్ల కారురోడ్డుగా మార్చలేదో అనూహ్యం. రోడ్లను సందర్శించకుండానే ఎస్టిమేట్లు తయారుచేసే యింజినీరింగ్ శాఖ, రోడ్డుపనుల్ని గంగలోకల్పి ప్రాంతీయాభిమానంతో గ్రాంట్లు మంజూరు చేసే అనధికారుల స్వార్థపరత్వమూ—ముఖ్యమైనరోడ్లు యిట్లా దుస్థితి పాలగుటకు కారణం.

ఇప్పుడు తోలివుండే మెటలుతోనైనా అర్జంటుగా గుంటలు పూడ్చింది యీరోడ్డుకు మోక్షం కల్గించాలని కోరుతున్నాను.

—ఒక పంచాయతి అధ్యక్షుడు.

### కరకర లాడుతున్న కనిగిరి డివిజన్ రోడ్లు

ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారైన సచ్చిదానందంగారూ! ఈ పోకటి రెండు సంవత్సరాల్లో కనిగిరి డివిజన్ రోడ్లకుగాను ఎంత శాంక్షన్ అయింది, ఎంత మరమ్మత్తులకు ఖర్చుపెట్టింది సెలవిస్తారా? మారోడ్ల దుస్థితి తమదృష్టికి రానేలేదా? మాకిక మోక్షమేలేదా? ఛేర్మెన్ గారు దక్షిణ ప్రాంతీయులని, దక్షిణ ప్రాంతాల్లోనే ప్రత్యేకశ్రద్ధ వహించి తారురోడ్లు పరిపించడం, మాప్రాంతాలకు పేరొత్త కారురోడ్డూ లేకపోవడం అలావుంది, కనీసంవుండే రోడ్లకైనా మరమ్మత్తు చేయడానికి మీరు యేదర్యా తీసుకోకుండా పోవడం సబబుగా వుందంటారా?

—ఒక ప్రయాణీకుడు

—తరువాత 11-వ పేజీలో

